ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.0
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
శుక్రవారం 25 అక్టోబరు 2024





యాదగిరీశుడికి
శాస్త్రోక్తంగా పూజలు
●6లో..

నేటినుంచి
పశుగణన
ఏర్పాట్లు పూర్తి
●8లో..

రేపు సీడీఎంఏ కార్యాలయం
ఎదుట ధర్నా



వాస్తవాల ఆధారంగా
నివేదిక రూపొందించాలి
- ఎసెన్షియల్ రిపోర్టును బహిరంగపరచాలి
- కలెక్టర్‌కు అఖిలపక్షాల వినతి

సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తోంది
కమ్యూనిస్టులే
సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెల్లెల పెంటయ్య

సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు
అనుమతులివ్వొద్దు
మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

●8లో..



ఆర్‌ఆర్‌ఆర్
పరిహారం రెట్టింపు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా భారతమాల పరియోజన కింద నిర్మించనున్న రీజనల్ రింగ్‌రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) పరిహారాన్ని రెట్టింపు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అలైన్‌మెంట్‌ను మార్చాలని రైతులు కొన్నాళ్లుగా ఆందోళనబాట పట్టి, భూసేకరణ సర్వే పనులు, విచారణ సమావేశాలను అడ్డుకుంటూ నిరసన తెలిపారు. అయితే వీటిని పట్టించుకోకుండా పాత అలైన్‌మెంట్ ప్రకారమే ముందుకు వెళ్లాలని, ఎలాంటి మార్పు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

- (ఆంధ్రజ్యోతి, యాదాద్రి)

» సవరించిన మార్కెట్ ధరలతో కేంద్రానికి నివేదిక » గతంలో నిర్ణయించిన ధర కంటే మూడురెట్లు పెరిగే అవకాశం » అలైన్‌మెంట్‌లో ఎలాంటి మార్పు లేదు

ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి భూసేకరణ నిమిత్తం ప్రభుత్వం ఇప్పటికే 3జీ నోటిఫికేషన్ జారీచేసింది. అవార్డు పాస్ తుది దశలో ఉంది. ఈ నేపథ్యంలో ఆర్‌ఆర్‌ఆర్‌తో భూములు, ప్లాట్లు కోల్పోతున్న రైతులకు, యజమానులకు పరిహారం రెట్టింపు స్థాయిలో పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చాలా ప్రాంతాల్లో భూములు కోల్పోతున్న బాధితులకు పరిహారం మూడురెట్లు అధికం కానుంది. అయితే పరిహారం నిర్ణయంలో భారీ తేడా ఉండటంతో భూములు ఇచ్చేందుకు రైతులు ఒప్పుకోవడంలేదు. భూసేకరణ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరించాల్సి ఉంది. సవరించిన పరిహారాన్ని చెల్లించేందుకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక పంపింది. ఆర్‌ఆర్‌ఆర్‌పై గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న అలైన్‌మెంట్‌కే ప్రస్తుత ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. అలైన్‌మెంట్‌ను మార్చే ప్రసక్తే లేదని, అవసరమైతే భూములు కోల్పోతున్న...

- మిగతా 8వ పేజీలో...

ట్రిపుల్‌ఆర్‌కు ముమ్మరంగా
భూసేకరణ
●8లో..

» చౌటుప్పల్ డివిజన్‌లో 784.160 ఎకరాల భూమి అవసరం
» ఇప్పటికే 784 ఎకరాలకు 3జీ నోటిఫికేషన్ జారీ
» మరో 16.24 ఎకరాలకు కొత్తగా నోటిఫికేషన్ జారీకి సన్నాహాలు

డివిజన్ల వారీగా సేకరించే భూమి ఇలా..

డివిజన్	నుంచి	వరకు	సేకరించే భూమి
భువనగిరి	118.188కి.మీ	133.178కి.మీ	492
చౌటుప్పల్	133.178కి.మీ	158.64కి.మీ	784.16

దీనికి అదనంగా చౌటుప్పల్ వద్ద జంక్షన్ల కోసం 188ఎకరాల భూసేకరణకు అధికారులు నోటిఫికేషన్ జారీచేశారు. ఈరెండు డివిజన్ల పరిధిలో సర్వే పనులు పూర్తికాగా,అవార్డు పాస్‌కోసం విచారణ కొనసాగుతోంది.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వాసితుల ధర్నా

భూమికి బదులు భూమి ఇవ్వాలి
●8లో..

» నిర్వాసితుల డిమాండ్
» తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

వికసిత్ భారత్
లక్ష్యం కావాలి

» మహిళా సాధికారతతోనే భవిష్యత్ అభివృద్ధి
» ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి » గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, పక్కన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సెక్రటరీ బుర్రా వెంకటేశం, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భారతదేశం 2047 నాటికి అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించి వికసిత్ భారత్ కావాలని, అదే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆకాంక్షించారు. గురువారం సూర్యాపేట జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం సమావేశ మందిరంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ అందాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. 2021లో జిల్లాలో 73శాతంగా ఉన్న రక్తహీనతను ఈ ఏడాదికి 21శాతానికి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను పూర్తి వివరాలతో సమర్పిస్తే రాష్ట్రవ్యాప్తంగా రక్తహీనతను నివారించేందుకు ఉపయోగపడుతుందన్నారు. స్వచ్ఛభారత్ అనేది కార్యక్రమం కాదని అదొక ఉద్యమమన్నారు. జిల్లాలో 475 గ్రామపంచాయతీలు బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలు ప్రకటించడం సంతోషకరమన్నారు. స్వచ్ఛభారత్‌లో అన్నివర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాలోని ప్రజలను దారిద్ర్యరేఖ నుంచి పైకి తీసుకువచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులను భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో స్వయంసహాయక మహిళా సంఘాల కార్యక్రమాలు బాగున్నాయని, భవిష్యత్ అభివృద్ధి మహిళా సాధికారితపై ఆధారపడి ఉందన్నారు. మహిళల చేతుల్లో డబ్బులు ఉన్నప్పుడు ఆర్థిక సాధికారత వస్తుందన్నారు. స్వయంశక్తితో ఉపాధి కల్పించుకుని విజయాలు సాధించిన మహిళలను సమాజానికి తెలియజేయాలని, అప్పుడే ఇతరులు వారిని స్ఫూర్తి

- మిగతా 6వ పేజీలో

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

» ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు చింతల శివ » ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి ఉద్రిక్తం



భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఓ విద్యార్థిని అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీస్

భువనగిరి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని, సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయపోవడంతో ప్రైవేట్ కళాశాలలు మూతపడే స్థితికి చేరాయని దీంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు అన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. ర్యాలీగా వచ్చిన విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు కార్యాలయం గేట్ బయట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో కొందరు కార్యాలయంలోనికి దూసుకువెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆందోళనకారులను బలవంతంగా అదుపులోకి తీసుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరికొద్దిమంది గేటుపై నుంచి కార్యాలయంలోకి దూకేందుకు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా చింతల శివ, రాజు మాట్లాడుతూ, నూతన విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలు చేయవద్దని, విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేముల నాగరాజు, ఈర్ల రాహుల్, శ్రీనివాస్, జగన్, ఉదయ్, భవానిశంకర్, నరేందర్, చింటూ, శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ యాజమాన్యాలు రాజకీయాలు మానుకోవాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా విద్యార్థి సంఘాలతో ఆందోళనలు చేయిస్తున్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు రాజకీయాలను మానుకోవాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్ అన్నారు. యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఓ డిగ్రీ కళాశాల ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నోరు మెదపని యాజమాన్యాలు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థులను రెచ్చగొడుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా వైఖరి మార్చుకోకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, కౌన్సిలర్ ఖైరంకొండ వెంకటేష్, పడిగెల ప్రదీప్, సిరిపంగ చందు, వడిచర్ల కృష్ణాయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి

యాదగిరిపల్లి గ్రామస్థుల డిమాండ్




తహసీల్దార్ కార్యాలయం ఎదుట అధికారులతో గ్రామస్థుల వాగ్వాదం

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 24: లేని భూమికి అక్రమంగా మ్యుటేషన్ చేస్తున్న తహసీల్దార్ దేశ్యానాయక్, సంబంధిత అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని యాదగిరిపల్లి గ్రామస్థుల డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట యాదగిరిపల్లికి చెందిన అఖిల పక్ష నాయకులు, గ్రామస్థులు సుమారు 2గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దండు విజయలక్ష్మి అనే మహిళ 1999లో సర్వేనంబర్ 4.20 గుంటల భూమి కొనుగోలు చేసి 2008, 2013లోగా ఆ భూమి మొత్తాన్ని ఇతరులకు విక్రయించిందన్నారు. అదే సర్వేనంబర్‌లో వందేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన దొరలు సుమారు 2ఎకరాల భూమిని పూసల, ముదిరాజ్, ఇతర కులాలకు 10గుంటల చొప్పున దానం చేశారన్నారు. అందులో ప్రస్తుతం దోబీఘాట్, శ్మశానవాటిక, ఇతర అవసరాల నిమిత్తం గ్రామస్థులు వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం ఆ భూమి అధిక ధర పలుకుతుండటంతో మండలానికి చెందిన ఓ రియల్టర్ విజయలక్ష్మి పేరున పదేళ్లుగా మ్యుటేషన్‌కు ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. ఇటీవల ఆ భూమి మ్యుటేషన్ ప్రతిపాదనలను ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయానికి స్థానిక తహసీల్దార్ పంపించారన్నారు. ఇప్పటికైనా సదరు మ్యుటేషన్‌ను నిలిపివేయాలని, ఇందులో భాగమైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కాటంరాజు, కౌన్సిలర్లు సీసీ విజయలక్ష్మికృష్ణగౌడ్, బూడిద సురేందర్, శిఖ శ్రీనివాస్‌గౌడ్, పాపట్ల నరహరి, నాయకులు రేకల రాజు, బరిగె రాంచందర్, రాగీర్‌రాజు, చిత్తర్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల్లో ఉందనే డిజిటల్ సైన్‌కు పంపాం


ఈ విషయమై తహసీల్దార్ దేశ్యానాయక్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, యాదగిరిపల్లి సర్వేనంబర్ 152లో దండు విజయలక్ష్మికి 2ఎకరాల భూమి ఉన్నట్లు పాత పహాణీ, రికార్డుల్లో వస్తోందని, ఆ భూమిపై ఆర్ఐ చేసిన విచారణ ఆధారంగానే మ్యుటేషన్ కాదని, డిజిటల్ సైన్ కోసమే పంపానని తెలిపారు. గ్రామస్థులు ఈ భూమి విషయం తన దృష్టికి తేలేదని, తాను ఆ భూమి వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ చేయిస్తానని అన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మేక అశోక్‌రెడ్డి, మాటూరి బాలరాజుగౌడ్ అన్నారు. గురువారం ఈ మేరకు కలెక్టర్ హనుమంతు కే.జెండగేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని అన్నారు. వెంటనే కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఇతర జిల్లాల మాదిరిగా ధాన్యం తూర్పారపట్టకుండా ఉన్నా కొనుగోలు చేయాలని కోరారు. 40కిలోల ధాన్యం బస్తాకు 42కిలోల వరకు తూకం వేస్తూ రైతులను మోసం చేస్తున్నారని, బస్తా తూకం 750 గ్రాములు మాత్రమే ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మంగ నర్సింహులు, పీఏసీఎస్ చైర్మన్ యాదిరెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా కేంద్రానికి సమీపంలో మూసీ నదిపై నిర్మించిన ఒకప్పటి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారికి వారధి ఇది. హైవే విస్తరణలో భాగంగా నిర్మించిన నూతన బ్రిడ్జి మీది నుంచి వెళ్తున్న ప్రయాణికులను పచ్చనిపొలాలతో వారధి ఆకట్టుకుంటోంది. అక్కడ ఆగుతూ ప్రయాణికులు ఫొటోలు దిగుతున్నారు. సెల్ఫీలతో సందడి చేస్తున్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ఆలయంలో నిత్య కల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణ తంతు నిర్వహించారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయరీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.12,52,664 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.



మడిలో వడివడిగా...

ప్రకృతి కన్నెర్రతో దెబ్బతిన్న పొలాలను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పరిశీలించారు. గురువారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం పోరెడ్డిగూడెం, చిరుమర్తి, పాములపాడు గ్రామాల్లోని ఆయన పర్యటించారు. బాధితుల రైతుల వెంట పొలాల్లో నడుస్తూ వారి భుజంపై చేయి వేసి ధైర్యం చెబుతూ ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఏవో శివరాంకుమార్ ఉన్నారు.
(ఆంధ్రజ్యోతి-మాడ్గులపల్లి)

బ్యాడ్మింటన్ బంగారాలు

- క్రీడల్లో రాణిస్తున్న మిర్యాలగూడకు చెందిన రాధశ్రీ, జయశ్రీ
- రాష్ట్ర, జాతీయస్థాయి పతకాలు





ఈ అక్కాచెల్లెళ్లు బ్యాడ్మింటన్ రాకెట్ పట్టారంటే ప్రత్యర్థులు బెదిరిపోతారు. బరిలోకి దిగారంటే పతకం వచ్చే వరకూ విశ్రమించరు. సాధారణ కుటుంబంలో జన్మించిన రాధశ్రీ, జయశ్రీ బ్యాడ్మింటన్‌లో సూపర్ సిస్టర్స్‌గా పేరు తెచ్చుకుంటున్నారు. సింగిల్స్ అయినా డబుల్స్ అయినా అదరగొట్టాల్సిందే. ప్రత్యేక శిక్షణతో రాటుదేలిన ఇరువురు సిస్టర్స్ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తూ క్రీడాభిమానుల మన్ననలు పొందుతున్నారు ఈ అక్కాచెల్లెళ్లు.

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం రాజుపేట గ్రామానికి చెందిన మిట్టకోలు ఉపేందర్-సుజాత దంపతులు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి వలస వచ్చారు. కుమార్తెలు రాధశ్రీ, జయశ్రీలకు బ్యాడ్మింటన్ క్రీడపై ఉన్న అమితాసక్తిని గుర్తించి వేసవి ఉచిత శిక్షణ శిబిరంలో చేర్పించాడు. క్రీడాసాధనపై పట్టుదల, ఏకాగ్రత చూపించిన ఇరువురికి డీఎస్ఏ కోచ్ మారబోయిన రామకృష్ణ ప్రత్యేక శిక్షణనిచ్చాడు. నాటి నుంచి ఆత్మవిశ్వాసమే ఆయుధంగా ముందుకు సాగుతున్నారు. రాధశ్రీ డిగ్రీ పూర్తి చేయగా, జయశ్రీ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదవుతోంది.

రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తూ..

బ్యాడ్మింటన్ సిస్టర్స్ రాధశ్రీ, జయశ్రీలు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తూ తోటి క్రీడాకారులకు సవాల్ విసురుతున్నారు. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో తమదైన ప్రతిభ కనబరుస్తూ పతకాల పంట పండిస్తున్నారు. అండర్-13, అండర్-15, అండర్-17, అండర్-19, ఖేల్ ఇండియా, విభాగాల్లో సత్తాచాటిన వీరిద్దరూ మూడేళ్ల పాటు జిల్లా ఛాంపియన్లుగా ఉన్నారు. రాధశ్రీ జిల్లా స్థాయిలో ఐదు బంగారు పతకాలు, రెండు వెండి, మరో కాంస్య పతకం సాధించింది. ఇక జయశ్రీ ఎనిమిది బంగారు,కాంస్య పతకాలు సాధించి రికార్డు సృష్టించింది. మరో ఐదు వెండి పతకాలతో పాటు పలు విభాగాల్లో మెడల్స్ సాధించింది.



ప్రోత్సాహమిస్తే మరింత రాణిస్తా

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ సాధన చేయడం కష్టంగా ఉంది. పోటీపరీక్షలకు సిద్ధమవుతూనే సాధన చేస్తున్నా. దాతలు సహకారం అందించాలి. ఏ ఇబ్బంది లేకుండా ఉంటే మరింతగా రాణిస్తా. కోచ్ ప్రోత్సాహమే ఇప్పటివరకు ఆడించింది. ఉచిత శిక్షణతో వెన్నుతట్టడం ఆయన గొప్పతనం.

- రాధశ్రీ, క్రీడాకారిణి



దేశం తరపున ఆడాలని

రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నా. దేశం తరుపున ఆడాలని ఉంది. పట్టుదలతో అకాడమీకి ఎంపికైనా ఆర్థిక ఇబ్బందుల కారణంగా వెళ్లలేకపోయా. అమ్మ, నాన్న, కోచ్ వల్లే ఈ స్థాయికి వచ్చా.

జయశ్రీ, క్రీడాకారిణి

నౌకా దళ క్విజ్‌కు 'తేజ' విద్యార్థులు



కోదాడ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండ తేజ విద్యాలయ విద్యార్థులు నౌకా దళ క్విజ్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమా సోమిరెడ్డి తెలిపారు. జాతీయస్థాయిలో భారత నావికా దళం థింక్యూ-2024 పేరిట పాఠశాల స్థాయి విద్యార్థులకు దేశవ్యాప్తంగా సెప్టెంబరులో క్విజ్ నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో 9వేల పాఠశాలలు పాల్గొనగా, మూడు దశల్లో రాత పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించి ఫైనల్ పోటీలకు 16 పాఠశాలల జట్లను ఎంపిక చేశారన్నారు. తెలంగాణ నుంచి తమ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి నోముల సృజన్ గుప్తా, 10వ తరగతి విద్యార్థి కొండ్ర నవీన్‌కుమార్‌ల జట్టు ఎంపికయ్యారన్నారు.

సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు గురుమూర్తి



మఠంపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలకేంద్రానికి చెందిన ములకలపల్లి గురుమూర్తి సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ సతీష్ గురువారం తెలిపారు. ఈ నెల 23న నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎంజీ యూనివర్శిటీలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో నల్లగొండ ఎన్‌జీ డిగ్రీ కళాశాలలో చదువుతున్న గురుమూర్తి ప్రతిభ కనబరిచి సౌత్ జోన్ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 30న చెన్నైలోని మిల్కాసింగ్ స్టేడియంలో నిర్వహించే కబడ్డీ పోటీల్లో పాల్గొంటాడని ఆయన తెలిపారు. గురుమూర్తి సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక కావడంపై నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అభినందించారు.

ధార్మిక క్షేత్రాలకు భారత్ గౌరవ్ రైళ్లు



భువనగిరి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ధార్మికక్షేత్రాలను తక్కువ ఖర్చుతో సందర్శించేలా రైల్వే శాఖ భారత్ గౌరవ్ రైళ్లను నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ ప్రతినిధి పవన్‌కుమార్ సెంగార్ అన్నారు. గురువారం భువనగిరి రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మగౌరవ్ రైళ్లలో ప్రయాణించే భక్తులకు ప్యాకేజీ రూపకంలో వసతి, దైవ దర్శనం, భోజనం తదితర సదుపాయాలన్నీ కల్పిస్తామన్నారు. 3 ప్యాకేజీలుగా ప్రయాణాలు ఉంటాయన్నారు. జ్యోతిర్లింగాలు, దివ్య దర్శనాల కోసం నవంబరు 6 నుంచి 14 వరకు శబరిమలైకు, నవంబర్ 16 నుంచి 20 వరకు భారత్ గౌరవ్ రైళ్లు నడుపుతున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్‌లో ప్రారంభమయ్యే జ్యోతిర్లింగాల రైలు వరంగల్ మార్గంలో, శబరిమల రైలు నడికుడి మార్గంలో ప్రయాణిస్తాయని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్లు 9281030711, 9281030750కు సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐఆర్‌సీటీసీ మేనేజర్లు శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి



- ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య అల్తాఫ్‌హుస్సేన్ అన్నారు. ఎంజీయూ 31వ ఆంధ్ర, తెలంగాణ బెటాలియన్ సహకారంతో గురువారం ఇంజనీరింగ్ విద్యార్థులకు నేషనల్ క్యాడెట్ కార్ప్స్ రాత పరీక్ష, దేహాధారుడ్య పరీక్షల ద్వారా ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యువత విద్యార్థి దశ నుంచే తమను తాము మలుచుకుంటూ సమాజ నిర్మాణంలో పరిపూర్ణ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 31వ బెటాలియన్ కల్నల్ లక్ష్మారెడ్డి, రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ సుధారాణి, రేఖ, హరీష్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



హెల్మెట్ ఏదీ?

హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న నలుగురు ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సూర్యాపేట జిల్లా కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్

వికసిత్ భారత్ లక్ష్యం కావాలి



సమావేశానికి హాజరైన జిల్లాలోని మునిసిపల్ చైర్‌పర్సన్లు, అధికారులు





గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు బోకే అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



బోకే అందజేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

(5వ పేజీ తరువాయి)

తీసుకుని అభివృద్ధి చెందుతారన్నారు. జిల్లాలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. వారికి విద్యతో పాటు చేతివృత్తులకు సంబంధించిన వస్తువుల తయారీపై అవగాహన కల్పిస్తే ఇంకా విజ్ఞానవంతులు అయ్యే అవకాశం ఉంటుందన్నారు.సమాజం అంటే సంపద కాదని, సమాజం అంటే సంస్కృతి అన్నారు. ముందుగా కలెక్టరేట్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ బుర్రా వెంకటేశం, జాయింట్ సెక్రటరీ భవానీశంకర్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, కోదాడ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్‌పద్మావతిరెడ్డి, సూర్యాపేట, హుజూర్‌నగర్, తిరుమలగిరి మునిసిపల్ చైర్‌పర్సన్లు పెరుమాళ్ల అన్నపూర్ణ, అర్చన, అనసూర్య, కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు వెంకన్నయాదవ్ పాల్గొన్నారు.

జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాను సస్యశ్యామలంగా మారుస్తామని మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు జిల్లాలోని నీటి పారుదల అభివృద్ధి, జిల్లా ప్రాశస్త్యాన్ని మంత్రి ఉత్తమ్ వివరించారు. ఇప్పటికే వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధిస్తున్న జిల్లా సిమెంట్ పరిశ్రమలతో పాటు రైస్‌మిల్లులతో పారిశ్రామిక రంగంలోనూ అభివృద్ధి చెందనున్నట్లు వివరించారు. చారిత్రక నేపథ్యానికి సూర్యాపేట బలమైన పునాదన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలకు అడ్డా సూర్యాపేట అని కొనియాడారు. జాగీర్‌దారులు, జమీందార్లకు వ్యతిరేకంగా ఉద్యమించిన గడ్డ సూర్యాపేట అని మంత్రి గవర్నర్‌కు వివరించారు. నైజాంకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిలూదినది కూడా సూర్యాపేట నుంచేనని గుర్తుచేశారు. నూతనంగా ఏర్పడ్డా అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన ఫలితాలు సాధిస్తోందన్నారు. చిన్నరాష్ట్రం అయినా ఆర్థికాభివృద్ధిలో సుసంపన్నంగా నిలదొక్కుకుందన్నారు. పారిశ్రామిక రంగంలో వేగవంతమైన అభివృద్ధి సాధిస్తోందన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పారిశ్రామికవేత్తలు బారులు తీరుతున్నారని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

ఈ సీజన్ నుంచే బోనస్

ఈ సీజన్ నుంచే సన్నరకం ధాన్యానికి క్వింటాకు మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ అందజేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం రూ.20వేల కోట్లను వెచ్చించనుందన్నారు. సాగునీటి రంగానికి ప్రభుత్వం రూ.28వేల కోట్లను ఖర్చు చేయనుందని, ఆయా నిధులతో ప్రాజెక్టుల నిర్మాణాలు, ఆనకట్టల ఆధునికీకరణ పనులను వేగంగా చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలిపారు. జనవరి నుంచి తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి సన్నబియ్యం అందించనున్నట్లు స్పష్టం చేశారు.

పత్తి రైతుల సమస్యలను పరిష్కరించాలి: జగదీష్‌రెడ్డి



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌కు విచ్చేసిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు ఆయన పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాలకు పత్తి పంట దెబ్బతిన్నదని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పత్తి పంట సాగు చేసిన రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం అందించలేదన్నారు. పత్తి పంట విషయంలో తెలంగాణ రాష్ట్రంపట్ల కేంద్రం వివక్ష చూపుతోందన్నారు. గుజరాత్ రాష్ట్రంలో పండిన పత్తి కంటే తెలంగాణలో పండించిన పత్తి నాణ్యంగా ఉన్నా కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. గుజరాత్‌లో మద్దతు ధర పత్తి క్వింటాకు రూ.8,200 ఉండగా రాష్ట్రంలో మాత్రం రూ.7600 మాత్రమే చెల్లిస్తున్నారని దుయ్యబట్టారు. అకాల వర్షాలతో ఆశించిన స్థాయిలో పత్తి దిగుబడి రావడంలేదని, ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం నాలుగు క్వింటాళ్లు మాత్రమే వస్తుందన్నారు. పంటను విక్రయించేందుకు సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలుకేంద్రాలు ఏర్పాటుచేయలేదన్నారు.దీంతో రైతులు ప్రైవేట్‌లో తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటువిషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంకా విధివిధానాలు రూపొందించకపోవడం బాధాకరమన్నారు. ధాన్యం సీఎంఆర్ విషయంలో మిల్లర్లు తమవల్ల కాదని అంటున్నారని అయినా వారితో ప్రభుత్వం మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, బీఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, తూడి నర్సింహారావు, భాషా, బత్తుల ప్రసాద్ ఉన్నారు.

మిర్యాలగూడ వాసికి జాతీయ పురస్కారం


సందీప్‌కుమార్

మిర్యాలగూడ, మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):సామాజిక సేవకుడు, పర్యావరణ ప్రేమికుడు అవిరెండ్ల సందీప్‌కుమార్ సర్దార్ వల్లభాయి పటేల్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు హోప్ స్వచ్ఛంద సేవా సమితి సింధుఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షుడు దైద వెంకన్న చరవాణి ద్వారా సందేశం అందినట్లు ఆయన తెలిపారు. మిర్యాలగూడ వాసిగా పట్టణ పరిసర ప్రాంత నిరుపేదలకు అన్నదానం, దుప్పట్ల పంపిణీతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడినందుకు పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. లక్ష విత్తనాలు భూమిపై చల్లి, మరో 75 వేల విత్తనాలను సేకరించారు. మిత్రుల సహకారంతో దక్కిన ఈ పురస్కారం తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని భవిష్యత్‌లో మరింతగా సమాజసేవకు పాటుపడుతానని అన్నారు. ఈ నెల 27న హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నట్లు వివరించారు.

విత్తనోత్పత్తి క్షేత్రంలో కందుల వేలం


కందుల వేలం నిర్వహిస్తున్న అధికారులు

డిండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డిండి మండల కేంద్రంలోని విత్తనోత్పత్తి క్షేత్రంలో పండించిన కందులను వ్యవసాయ శాఖ అధికారులు గురువారం వేలం వేశారు. 2023-24 సంవత్సరంలో డిండి, చెర్కుపల్లి విత్తనోత్పత్తి క్షేత్రంలో పండించిన 67 క్వింటాళ్ల కందులు విత్తనాలకు అనువుగా లేకపోవడంతో గురువారం వేలం వేశారు. మిర్యాలగూడకు చెందిన కె.శ్రీనివాస్ క్వింటా రూ.7,560లకు వేలంలో కందులను దక్కించుకున్నా రు. విత్తనాలకు అనువుగా లేకపోవడం వల్లనే కందులను విక్రయించినట్లు ఫాం ఏడీ నివేదిత తెలిపారు. వేలంలో ఐదుగురు ట్రేడర్స్ పాల్గొనగా శ్రీనివాస్ రూ.7,560లకు కందులను దక్కించుకున్నారు.కార్యక్రమంలో ఏడీ.శ్రీలక్ష్మి, ఏవో వెంకన్న, రామలింగేశ్వరరావు, మాధవి, పాల్గొన్నారు.

సాగర్‌లో 'పవర్ ఫుల్'



- ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ముమ్మరంగా విద్యుదుత్పత్తి
- ఈ ఏడాది లక్ష్యం 1400 మిలియన్ యూనిట్లు

నాగార్జునసాగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని మూడు నెలల్లోనే చేరుకున్నారు. రెండేళ్ల తర్వాత ఎగువ నుంచి భారీ స్థాయిలో వరద వచ్చి చేరటంతో ఈ ఏడాది సాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో జూలై 24వ తేదీన విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. ఈ ఏడాది విద్యుదుత్పత్తి లక్ష్యం 1,400 మిలియన్ యూనిట్లు కాగా మూడు నెలల్లో మంగళవారం మధ్యాహ్నం (అక్టోబరు 22వ తేదీ) నాటికి లక్ష్యాన్ని చేరుకున్నట్లు జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఒక్క రోజుకు 75 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి కాగా మొత్తం విద్యుదుత్పత్తి 1,475 మిలియన్ యూనిట్లు సీఈ తెలిపారు. గత ఏడాది సాగర్‌కు ఎగువ నుంచి వరద రాకపోవడంతో విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని (1530 మిలియన్ యూనిట్లు) చేరుకోలేదు. ఈ ఏడాది ఈ ఆర్థిక సంవత్సరంలో (ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు) జూన్ మొదటి వారంలో సాగర్‌కు నీటి రాక లేక విద్యుదుత్పత్తి ప్రారంభించలేదు. జూలై 24వ తేదీ నుంచి ఎగువనుంచి సాగర్‌కు వరద రాక ప్రారంభం కావడంతో ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని జెన్‌కో అధికారులు ప్రారంభించారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్లు ఉండగా ఒక్కో టర్బైన్ నుంచి 110 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. అందులో రెండో నంబరు టర్బైన్ ఏడాదిగా మరమ్మతులకు గురైంది. దీంతో ప్రస్తుతం ఏడు టర్బైన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేసినప్పటికి మూడు నెలల కాలంలో లక్ష్యాన్ని చేరుకున్నామని సీఈ తెలిపారు. రెండో నంబరు టర్బైన్ మరమ్మతు పనులు మంగళవారం ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. మరమ్మతు చేసేందుకు జపాన్ దేశం నుంచి సాంకేతిక నిపుణులు రావాల్సి ఉండగా సరైన సమయంలో వారు రాలేదు. వారం రోజుల క్రితం వారు సాగర్‌కు వచ్చారు. నిపుణుల సలహాలు, సూచనల మేరకు మరమ్మతుల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రెండు నెలల సమయం పడుతుందని జపాన్ ఇంజనీర్లు తెలుపగా, 45 రోజుల్లో పూర్తి చేయాలని కోరినట్లు సీఈ తెలిపారు.




నాలుగేళ్లలో సాగర్ ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి ఇలా..

సంవత్సరం	లక్ష్యం(మిలియన్ యూనిట్లు)	ఉత్పత్తి (మి.యూ)
2019-20	1289	1512.85
2020-21	1290	1248.78
2021-22	1535	2262.62
2022-23	1500	2355.63
2023-24	1530	540.83
2024-25	1400	1400

(జూలై 24 నుంచి అక్టోబరు22 వరకు)

మూడు నెలల్లోనే లక్ష్యాన్ని అధిగమించాం



సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఈ ఏడాది ఉన్నతాధికారులు నిర్ణయించిన 1,400 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాం. గత ఏడాది సాగర్ ప్రాజెక్టులో సరిపడా నీరు లేకపోవడంతో కేవలం 540.83 మిలియన్ యూనిట్లు మా త్రమే విద్యుదుత్పత్తి చేశాం. ఈ ఏడాది సాగర్ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీరు వచ్చి చేరింది.ఏడు టర్బైన్ల ద్వారా పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తిని ప్రారంభించి మూడు నెలల్లో లక్ష్యాన్ని చేరుకున్నాం. అవసరం ఉన్నంత మేరకు విద్యుతుత్పత్తి కొనసాగుతుంది.

- మంగేష్ కుమార్, జెన్‌కో సీఈ

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.154	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.148	214	244

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	590.00
టీఎంసీలు	312.0450
ఎడమకాల్వకు నీటి విడుదల	6,173
కుడికాల్వకు	10,350
విద్యుత్ కేంద్రం ద్వారా	28,826
క్రస్ట్ గేట్ల ద్వారా	1,62,000
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	1,51,529 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	2,10,149 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	20

- నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.37 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	21,640
అవుట్‌ఫ్లో	16 వేల క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

- మేళ్లచెర్వు,(ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.60అడుగులు
టీఎంసీలు	4.09
ఎన్ని గేట్ల ద్వారా	2 గేట్ల ద్వారా
ఇన్‌ఫ్లో	697.33 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	944.09 క్యూసెక్కులు

- కేతేపల్లి,(ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం

పూర్తి స్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	20 అడుగులు

- శాలిగౌరారం,(ఆంధ్రజ్యోతి)

డిండి

పూర్తి స్థాయి నీటిమట్టం	36 అడుగులు
టీఎంసీలు	2.4
ప్రస్తుత నీటిమట్టం	36 అడుగులు
ఇన్‌ఫ్లో	3750 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	3750 క్యూసెక్కులు

-డిండి,(ఆంధ్రజ్యోతి)

సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఎంపీ చామల



శాలిగౌరారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ చైర్మన్‌గా చేసిన సంప్రదింపుల కమిటీలో స భ్యుడిగా భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కు మార్‌రెడ్డి నియమితులయ్యారు. లోక్ సభ నుంచి ఎనిమిది మంది రాజ్యసభ నుంచి నలుగురు, అలాగే ఇద్దరు ఎక్స్‌అఫిషియో సభ్యులతో మొత్తం 14 మంది సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో రాష్ట్రం నుంచి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్ రెడ్డికి చోటు కల్పించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి నియామకం పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బంగారం మెరుగు పెడతామని మోసం

త్రిపురారం,అక్టోబర్24(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు బంగారం మెరుగుపెడతామని చెప్పి మహిళ వద్ద పుస్తెలతాడు తీసుకొని మెరుగు పెట్టి తక్కువ తూకంతో మోసం చేశారు. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొంగరి సునీత ఇంటి వద్ద ఉండగా గురువారం ఉదయం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి బంగారం మెరుగుపడతామని చెప్పారు. వారిని నమ్మిపుస్తెల తాడును వారికి ఇచ్చింది. అనంతరం రసాయనాల్లో ముంచి ఆమెకు తిరిగి పుస్తెలతాడు ఇచ్చి వెళ్లిపోయారు. బంగారం బరువు తక్కువగా ఉన్నట్లు ఆమెకు అనుమానం రావడంతో కాంటా వేయ గా సుమారు 6 గ్రాములు తక్కువగా ఉన్నన ట్లు తేలింది. ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యా దు చేయగా కేసు నమోదు చేశారు. త్రిపురారం వద్ద సాయంత్రం వాహన తనిఖీలు చేస్తు ండగా మోసానికి పాల్పడిన ఇద్దరు పట్టుబడినట్లు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓవర్ టేక్ చేయబోయి లారీకి ఢీకొన్న కారు..

కేతేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈఘటన మండల కేంద్రం కేతేపల్లిలో జాతీయ రహదారిపై గురువారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న కారు డ్రైవర్ కేతేపల్లి ఎస్సీకాలనీ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసేందుకు యత్నించాడు. ఈ క్రమంలో అదే లారీని వెనుక భాగంలో బలంగా ఢీ కొట్టడంతో అదుపు తప్పిన కారు రోడ్డుపై పల్టీలు కొట్టింది. ప్రమాదంలో కారు బెలూన్లు తెరుచుకోవడంతో కారు నడుపుతున్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జుయ్యింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో వివరాలు తెలియలేదు.

'మల్బరీ సాగు లాభదాయకం'

గరిడేపల్లి, అక్టోబరు 24: ప్రత్యామ్నాయ పంటల సాగుకు మల్బరీ ఎంతో లాభదాయకంగా ఉంటుదని రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల అసిస్టెంట్ డైరక్టర్ ఆఫ్ సెరీక ల్చర్ ఎ.ముత్యాలు అన్నారు. గురువారం మండల పరిధిలోని గడ్డిపల్లి కేవీకేలో ప ట్టు రైతులకు నైపుణ్యతా శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ. ప్రత్యామ్నాయ పంటల సాగులో మల్బరీ సాగు ఎంతో లాభదాయకంగా ఉంటుదని, తద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీకే ఇంచార్జి, ప్రోగ్రాం డైరక్టర్ డి.నరేష్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ వినోద్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ టీ.మాధురి, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ రాఘవేందర్ పాల్గొన్నారు.0

తండ్రి నెల మాసికం నాడే తనయుడి మృతి

- కోనేరులో మునిగి మృత్యువాత
- సూర్యాపేట జిల్లా


ఆత్మకూరు(ఎస్)లో విషాదం


మహేష్‌చారి(ఫైల్)

ఆత్మకూరు(ఎస్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తండ్రికి నెల మాసికం నిర్వహించి కోనేరులో స్నానం చేసేందుకు వెళ్లినకుమారుడు నీటమునిగి మృతిచెందాడు. గురువారం సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్)మండలం పాతసూర్యాపేటలోని చక్రయ్యగుట్టపై ఈ విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాత సూర్యాపేటకు చెందిన పోలోజు రుక్నాచారి(52)కి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు మహేష్‌చారి(22) ఉన్నారు. 15ఏళ్ల క్రితం నూతనకల్ మండలం ఎర్రపాడు గ్రామానికి బతుకు దెరువు కోసం వెళ్లిన రుక్నాచారి అక్కడే బంగారం పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. కుమార్తెలకు వివాహం కాగా, కుమారుడు విద్యుత్ సంబంధ పనులు (ఎలక్ట్రీషియన్) నేర్చుకుంటున్నాడు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రుక్నాచారి స్వగ్రామ మమైన పాత సూర్యాపేటకు తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం రుక్నాచారి మృతి చెందాడు. గురువారం రుక్నాచారి కుమారుడు మహేష్‌చారి(22) కుటుంబ సభ్యులు బంధువులు గ్రామసమీపంలో ఉ న్న చక్రయ్య గుట్ట వద్దకు వెళ్లి నెల మాసికం క్రతువులు పూర్తి చేశారు. అనంతరం గుట్టపై ఉన్న కోనేరులో స్నానానికి దిగి ప్రమాదశాత్తు కాలుజారి నీటిలోకి జారాడు. 18 అడు గుల లోతులో ఉన్న కోనేరులో పడి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి చనిపోయాడు. బంధువులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికి ఫలితం లేకపోయింది. పరిసర ప్రాంతాల రైతులు వచ్చి రెండు గంటల పాటు కోనేరులో వెతికి మహేష్ మృతదేహాన్ని తీశారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మృతుడి తల్లి విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకర్‌నాయక్ తెలిపారు.

సూర్యాపేటలో మరో చైన్ లింక్ యాప్ మోసం

- ఆర్‌జీఏ పేరుతో కార్యాలయం ఏర్పాటు
- లక్షల్లో నష్టపోయిన నిరుపేదలు, రోజుకూలీలు



సూర్యాపేటక్రైం, అక్టోబరు 24: చైన్ లింక్ యాప్ ద్వారా అధిక డబ్బుల వస్తాయని ఆశపడి కొందరువ్యక్తులు నిలువునా మునిగారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం వెలుగులోకి వచ్చింది. అమెరికాకు చెందిన సంస్థగా చెబుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలంటూ ఓవ్యక్తి ఆర్‌జీఏ పేరుతో జూలైలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించాడు. అనంతరం అవగాహన సదస్సులు పెడుతూ వచ్చిన బాధితుల నుంచి రూ.1,800 కట్టించుకోవడమే కాకుండా వారు మరికొంత మందితో డబ్బులు కట్టించేలా జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తులు మధ్యవర్తులుగా నియమించుకున్నాడు. వీరి ద్వారా ఈ సంస్థల్లో రూ. 1,800 కట్టి సభ్యత్వం తీసుకుంటే యాప్ ఇచ్చి ప్రతిరోజు4 నుంచి 5 యాడ్‌లను పంపిస్తూ వాటిని చూసిన వారికి ప్రతి రోజు రూ.60లను యాప్‌లో జమ చేస్తుంటారు. ఇలా రూ. 1,800లు కడితే రోజుకు రూ.60, రూ. 4,500 కడితే రూ.260, అలాగే రూ. 15 వేలు కడితే రూ.540, అదేవిధంగా రూ.45 వేలు కడితే 1,620, లక్ష 20వేలు కడితే రూ.4,650, ప్రతి రోజు వస్తుంటాయి. ఇవేకాకుండా ఒకవ్యక్తి కింద రూ.400 మంది సభ్యులు చేరితే వారికి లక్షరూపాయల వేతనంతో పాటు వారు సమావేశాన్ని పెట్టుకునేందుకు అయ్యే ఖర్చును ఇస్తూ వచ్చారు. ఇలా జమ అయిన డబ్బు వారంలో ఒక రోజు ప్రతి మంగళవారం విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించగా మంగళవారం విత్‌డ్రా కనిపించక పోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సంస్థ ఎత్తేశారని తెలియడంతో కొందరు తమ బంధువులు తెలిసిన వారి వద్దకి డబ్బులు మాది గ్యారెంటీ అంటూ ప్రామిసరీ నోట్లు రాసి ఇచ్చి లక్షల్లో మోసపోయినట్లు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సుమారు 50వేల మంది ఉన్న ఆర్‌జీఏ బాధి తులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఈవిషయమై సదరు మోటివేటర్‌ను బాధితులు నిల దీయగా తాము కూడా మోసపోయామని చెప్పుకొచ్చారు. ఆర్‌జీఏ బాధితులు ఉమ్మడి నల్లగొండ వ్యాప్తంగా సూర్యాపేట పోలీస్ స్టేషన్‌కు వస్తున్నారు. పోలీసులు సదరు మధ్యవర్తిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారిస్తున్నట్లు తెలిసింది.

పెట్రోల్ బంక్‌లో గొడవ.. ఇరువురిపై కేసు


బంక్ తనిఖీ చేస్తున్న పి.రామకృష్ణ

కట్టంగూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పామనగుండ్ల గ్రామం 65వ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆర్‌పీ పెట్రోల్ బంక్‌లో జరిగిన గొడవపై ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. నార్కట్‌పల్లి మండలం తొండ్లాయికి చెందిన కారు యజమాని శరత్ కుమార్ ఈనెల 23న తన కారులో పెట్రోల్‌ను ఫుల్ ట్యాంక్ చేయమని సిబ్బందికి చెప్పారు. దాంతో బంక్ సిబ్బంది కార ులో 42లీటర్ల పెట్రోల్ కొట్టి డబ్బులు అడగగా కారు ట్యాంక్ కెపాసిటీ 35 లీటర్లని 42 లీటర్లు ఎలా పడు తుందని గొడవకు దిగాడు. ఈ నేపథ్యంలో బూతులు తిట్టి దౌర్జన్య చేశారని బంక్ సూపర్ వైజర్ గుడుగుంట్ల జానయ్య ఫిర్యాదు మేరకు కారు యజమాని శరత్‌కుమార్‌తో పాటు అతడి వెంట ఉన్న మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కారు కెపాసిటి 35 లీటర్లు ఉండగా బంక్ సిబ్బంది 42 లీటర్లు పెట్రోల్ కొట్టామని చెప్పి తన నుంచి దౌర్జన్యంగా డబ్బులు వసూలు చేశారని దుర్భాషలాడి వేధించారని శరత్ కుమార్ ఆన్‌లైన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు బంక్ యజమాని వివేక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పామనగుండ్ల పెట్రోల్ బంక్ తనిఖీ

మండలంలోని పామనగుండ్ల గ్రామంలో గల ఆర్‌పీ పెట్రోల్ బంక్‌యాజమాన్యం కొలతల్లో మోసానికి పాల్పదుతున్న ఆరోపణ రావడంతో జిల్లా తూనికల కొలతల అధికారి పి.రామకృష్ణ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంక్‌లో ఉన్న పంపుల డెలివరీ తనిఖీ చేయగా అంతా సక్రమంగా ఉందని తేలినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ డీటీ రాచకొండ జ్యోతి ఉన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

- కౌన్సెలింగ్ నిర్వహించిన అధికారులు
- బాలసదనానికి బాలిక తరలింపు

తుర్కపల్లి,అక్టోబరు24,(ఆంధ్ర జ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం ఓ గిరిజనతండాలో గురువారం ఉదయం జరుగాల్సిన బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని ఓ గిరిజన తండాకు చెందిన 16 ఏళ్ల మైనర్‌ను బొమ్మలరామారం మండలం గోవింద్ తండాకు చెందిన వ్యక్తితో వివాహం చేసేందుకు 20 రోజుల క్రితం వారి ఇరువురి కుటుంబ సభ్యులు నిశ్చయించారు. ఈ క్రమంలో 24న (గురువారం) వివాహం చేసేందుకు అన్నిఏర్పాట్లు చేసుకున్నారు. అయితే మైనర్‌కు వివాహం చేస్తున్నారనే పక్కా సమాచారంతో ఈ నెల 23న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం అధికారులు తండాను సందర్శించి బాలిక తల్లిదండ్రులు, బంధువులతో కౌన్సెలింగ్‌నిర్వహించారు. బాల్యవివాహం చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అమ్మాయి వయస్సును నిర్ధారించడానికి కావాల్సిన సర్టిఫికెట్లతో పాటు అబ్బాయి బంధువులను తీసుకొని భువనగిరి సీడబ్ల్యూసీ కార్యాలయానికి రావాలని చెప్పి వెళ్లారు. వారు వెళ్లగా బాలికకు సంబంధించిన అంగన్‌వాడీ టీచర్ల సర్వే రికార్డు, పాఠశాల రికార్డులను అధికారులు పరిశీలించి మైనర్‌గా నిర్ధారించారు. అనం తరం బాల్యవివాహాల వచ్చే అనార్థాలపై అవగాహన కల్పించారు. బాలికను బాల సదన్‌కు తరలించారు. ఈ నెల 27 మరోసారి బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తామని అధికారులు తెలిపారు. వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యురాలు జయశ్రీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం అధికారులు సైదులు, మహిపాల్, విజయరాణి ఉన్నారు.

కేతేపల్లి వాసికి జాతీయ ఉత్తమ రైతు పురస్కారం



ప్రశంసా పత్రం అందుకుంటున్న షేక్ సయ్యద్ అలీ

కేతేపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తున్న కేతేపల్లి మండలంలోని కాసనగోడు గ్రామానికి చెందిన యువ రైతు షేక్ సయ్యద్ అలీ ఉత్తమ రైతు పురస్కారాన్ని అందుకున్నారు. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో వెదజల్లే విధానం, డ్రమ్ సీడర్, మెట్ట వరి సాగు చేయడంతో పాటు పరిసర గ్రామాల రైతులను ఆ దిశగా సయ్యద్ అలీ ప్రోత్సహిస్తుంటాడు. ఈ క్రమంలో రైతు దినోత్సవం సందర్భంగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసీఏఆర్) ఆధ్వర్యంలో హైదరాబాద్ రాజేంద్రనగర్ లో భారతీయ వరి పరిశోధనా సంస్థ గురువా రం నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ అగ్రి కల్చర్ అండ్ ఫార్మర్ వేల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, ఎన్‌జీ.రంగా యూనివర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య, కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్‌కె.మీరాఅతార్బీ బాషాను సత్కరించి ప్రశం సాపత్రాన్ని అందజేశారు. ఉత్తమ రైతు పురస్కారాన్ని అందుకున్న సయ్యద్ అలీని కాసనగోడు గ్రామస్తులు అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో డీసీఎం డ్రైవర్ ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో డీసీఎం డ్రైవర్ ఫ్యాన్‌కు ఉరేసుకుని గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ మన్మధ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన చుక్కరాజు(38) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తూ మండలంలోని దండుమల్కాపురంలో అద్దెకు ఉంటున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో సతమత మవుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవ్వరూ లేని సమయం లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లుసీఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

తుర్కపల్లి, అక్టోబరు 24 : బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీ కొట్టడంతో యువకుడి మృతి చెందాడు.ఈ ఘటన తుర్కపల్లి-కుషాయగూడ ఆర్అండ్‌బీ రోడ్డుపై మాదాపూర్ గ్రా మ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ తక్యుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన సొన్నాయిల మహేశ్(27) రాత్రి బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. మాదాపూర్ గ్రామ సమీపంలో బైక్ రోడ్డు కల్వర్టును ఢీ కొట్టడంతో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ తక్యుద్దీన్ మృత దేహాన్ని శవాన్ని భువనగిరి ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానం గొప్పది :డీఎస్పీ

దేవరకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని దేవరకొండ డీఎస్పీ గిరిబాబు అన్నారు. గురువారం దేవరకొండ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సకాలంలో రక్తం అందుబాటులో లేక రోడ్డు ప్రమాదంలో గాయపడినవారు, గర్భిణులు మృతి చెందుతున్నారని ఆయన తెలిపారు. దేవరకొండ లయన్స్‌క్లబ్ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

భువనగిరిరూరల్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన కొండాపురం సూరయ్య ఈనెల 20 న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఆయన కుమారుడు బాలరాజు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం సూరయ్య ఇంటి పక్కనే ఉన్న సమీప బంధువు పార్వ తమ్మ ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని బాలయ్యకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వెంటనే వారు ఇంటికి రాగా ఇంటి తలుపులు, బీరువా తాళం తెరిచిఉన్నాయి.ఇంట్లో ఉంచిన దాదాపు 13 తులాల బంగారు ఆభరణాలు, దాదాపు 51 తులాల వెండి ఆభరణాలు, రూ.19వేల నగదు ఎత్తుకెళ్లారు. సూరయ్య కుమారుడు బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

జమ్మనకోటతండాలో 300 కిలోల నల్లబెల్లం పట్టివేత

తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం తనిఖీ చేపట్టి రూ.3లక్షల విలువైన నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాలో నల్లబెల్లాన్ని నిల్వ ఉంచారనే సమాచారంతో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ బాలరాజు, హాలియా ఎక్సైజ్ పోలీసులతో కలిసి తండాకు చేరుకొని నిల్వ ఉంచిన గోదాంపై ఆకస్మికంగా దాడి చేశారు. ఈ తనిఖీలో 300 కిలోల నల్లబెల్లం, 50 కిలోల ఆలం, 10 లీటర్ల నాటుసారా పట్టుబడింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన కృష్ణానాయక్ సారా తయారీ కోసం అక్రమంగా బెల్లం దాచి ఉంచినట్లు తెలిసింది. తనిఖీల్లో హాలియా ఎక్సైజ్ సీఐ కల్పన, ఎస్ఐ సంపత్‌లు పాల్గొన్నారు.

సమాచారం

నేటినుంచి పశుగణన ప్రారంభం

భువనగిరి కలెక్టరేట్/ భువనగిరి అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 21వ భారత పశుగణన కార్యాక్రమం ఈనెల 25వ తేదీనుంచి ప్రారంభమవుతుందని జిల్లా పశువైద్య, పశు సంవర్ధక అధికారి డాక్టర్ వి.క్రిష్ణ అన్నారు. పశుగణనను ఈనెల 25వ తేదీన ఢిల్లీలో కేంద్ర మత్స్య, పశు పాడిపరిశ్రమల మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్ ప్రారంభిస్తారని చెప్పారు. భారత పశుగణన నేటినుండి 4 నెలల పాటు 28 ఫిబ్రవరి 2025 వరకు కొనసాగుతుందని చెప్పారు. జిల్లాలోని ఆరు మునిసిపాలిటీలు, 17 మండలాలు, 421 గ్రామ పంచాయతీల్లో అన్నిరకాల ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు, కుక్కలు, బాతులు, గాడిదలు, గుర్రాలు మెదలైన వాటి సంఖ్యను సేకరిస్తారని వివరించారు. గత పశుగణనలో జిల్లాలో తెల్లజాతి పశువులు 69,173, గేదెలు 1,22,621, గొర్రెలు 4,47,331, కోళ్లు 45,08,382 ఉన్నాయని తెలిపారు. పశు సంవర్ధకశాఖకు చెందిన 34మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో శిక్షణ పొందిన 130 గణకులు 4 నెలల పాటు ప్రతీ ఇల్లు తిరిగి పశువుల వివరాలను సేకరిస్తారన్నారు. గ్రామాలలో పశుగణన చేసే విషయాన్ని ముందుగా తెలియజేస్తారని పశుపోషకులు, పెంపుడు జంతువులు ఉన్నవారు పశ ుసంవర్ధకశాఖకు పూర్తి సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే సామేల్ రాక

మోత్కూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఈనెల 25న ఉదయం 10.30 గంటలకు మోత్కూరు మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి, 11గంటలకు మోత్కూరు మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనడానికి మోత్కూరు రానున్నారని సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మునిసిపల్ చైర్ పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధలు రైతులు హాజరు కావాలని సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్వర్లు కోరారు.

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర మహాసభలు

భువనగిరి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర 4వ మహాసభను శుక్ర, శనివారాల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా అధ్యక్షుడు సురుపంగ ప్రకాశ్ తెలిపారు. రాష్ట్ర మహాసభల సందర్భంగా గురువారం భువనగిరిలో ఆయన వేదిక జెండాను ఎగురవేసి మాట్లాడారు. వికలాంగులందరూ మహాసభల్లో పాల్గొనాలన్నారు. బొల్లేపల్లి స్వామి, కొత్త లలిత, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

రేపు సీడీఎంఏ కార్యాలయం ఎదుట ధర్నా

భువనగిరి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం లక్ష్యంగా శుక్రవారం హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ తెలిపారు. గురువారం భువనగిరిలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో 61 ప్రకారం మూడు కేటగిరీల వారీగా కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ధర్నాకు కార్మికులందరూ తరలిరావాలన్నారు. నాయకులు కార్మికులు ఊదరి రామచందర్, సల్ల రాజయ్య, రాజలింగం, శంకర్, శాంతమ్మ, భాగ్యలక్ష్మీ, నరసమ్మ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా నర్సింహ

గుండాల,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గుండాల మండల ట్రాన్స్‌కో ఏఈగా అంబాల నర్సింహ, లైన్ ఇన్స్‌పెక్టర్‌గా కూరాకుల అంజయ్య గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఏఈ భరత్‌కుమార్ యాదగిరిగుట్టకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా గుండాల సెక్షన్ సిబ్బంది వారిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో లైన్‌మెన్ శేఖర్, అసిస్టెంటు, శ్రీధర్, శ్రీను పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

గుండాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పశువులలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి డా.యాకూబ్ అన్నారు. మండలంలోని గంగాపురం గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ శిబిరంలో 250 పశువులకు టీకాలు వేశామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల సంఘం చైర్మన్ ఎండి అలీం, విఏ ప్రవీన్, గోపాలమిత్రలు గోవిందు, శ్రీను, కృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

త్రిఫ్ట్ డబ్బులు చెల్లించాలి

భువనగిరి గంజ్ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు పొదుపు చేసుకున్న డబ్బుల నుంచి వ్యక్తిగత రుణాలు పట్టుకోవద్దని ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంకు అధికారులు కార్మికులను ఇబ్బందులకు గురి చేయకుండా తక్షణమే బడ్జెట్ కేటాయించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. భువనగిరి పట్టణంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇదే సమస్యపై ఇటీవల రాజధానిలో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా వ్యక్తిగత రుణాలు వెంటనే మాఫీ చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. జిల్లా అధ్యక్షుడు గుర్రం నర్సింహ, కోడి బాలనర్సింహ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సంస్థాన్ నారాయణపురం అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో గురువారం సిసి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. మాజీ ఎంపీపీ గుత్తా ఉమాప్రేమ్‌చందర్‌రెడ్డి నిర్మాణ పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి మందుగుల బాలకృష్ణ, ఏపూరి సతీష్, నరసింహ పాల్గొన్నారు.

వాస్తవాల ఆధారంగా నివేదికను రూపొందించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు జహంగీర్, అశోక్‌రెడ్డి, రాజిరెడ్డి, నర్సింహ

● ఎసెన్షియల్ రిపోర్టును బహిరంగ పరచాలి
● కలెక్టర్‌కు అఖిలపక్షాల వినతి

రామన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రామన్నపేటలో ప్రతిపాదించిన అదాని అంబుజా సిమెంట్ పరిశ్రమ ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన వారందరూ వ్యతిరేకత తెలిపారని, ఆ మేరకు వాస్తవ నివేదికనే రూపొందించాలని రామన్నపేట మండలంలో అఖిలపక్షాల నాయకులు కలెక్టర్ హనుమంతు కె జెండగేను కోరారు. ఈ మేరకు గురువారం భువనగిరిలోని కలెక్టరేట్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎసెన్షియల్ కమిటీకి పంపే నివేదికను బహిరంగ పర్చాలని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన 10వేల మంది ముక్తకంఠంతో పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకించాలని వివరించారు. పరిశ్రమ ఏర్పాటుతో పరిసరాలన్నీ కలుషితమవడంతో పాటు ప్రజా రోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు ఎండీ.జహంగీర్, మేక అశోక్‌రెడ్డి, గంగుల రాజిరెడ్డి, సిరిగిరెడ్డి మల్లారెడ్డి, జెల్లెల పెంటయ్య, ఎండీ.రేహన్, పల్లపు దుర్గయ్య, ఊట్కూరి నర్సింహ, బొడ్డుపల్లి వెంకటేశం, గోదాసు పృథ్వీరాజు, ఫజల్ బేగ్, జమీరొద్దీన్, ఎండీ.అక్రమ్, నకిరెకంటి నరేందర్, బావాండ్లపల్లి బాలరాజు, నోముల రాజు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులివ్వొద్దు : చిరుమర్తి

ప్రజారోగ్యం, పర్యావరణం, వ్యవసాయంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నా రు. గురువారం రామన్నపేటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణకు స్థానికులను అడ్డుకుని దూర ప్రాంతాల ప్రజలకు బిర్యానీలు, మందు తదితర ప్రలోభాలకు గురి చేసి తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణను పూర్తిచేశారని ఆరోపించారు. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును ప్రజలతో కలిసి బీఆర్ఎస్ అడ్డుకుంటుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ వైస్‌చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు మర్రి జలేందర్‌రెడ్డి, మెట్టు మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు సాల్వేరు అశోక్, దోమల సతీష్, గొరిగె నర్సింహ, బాలగోని నరసింహ, ఎండీ. అమేర్, నాయకులు సంతోష్, కర్నెబోయిన బలరాం, కూనూరు ముత్తయ్య, మల్లేశం, రాము, శివ, విక్రమ్ పాల్గొన్నారు.

● కాలుష్య కరక అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ప్రజాభిప్రాయంలో ప్రాంత ప్రజలు ఐక్యమత్యంతో పోరాడి వ్యతిరేక నిరసనలు వ్యక్తంచేయడం అభినందనీయమని వీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి అన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణం పట్ల మాజీ ఎమ్మెల్యే కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా మాట్లాడడం, చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని విమర్శించారు. వరికల్ గోపాల్‌ప్రజాపతి, నన్నూరి శంకర్‌రెడ్డి, బొడ్డు శంకర్, బొడ్డు వెంకటేశం పాల్గొన్నారు.

'సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తుంది కమ్యూనిస్టులే'

రామన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రామన్నపేటలో ఏర్పాటుకు ప్రతిపాదించిన సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా క్షేత్రస్థాయిలో పోరాడుతోంది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెల్లెల పెంటయ్య, సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రజలను తప్పు దోవ పట్టించేలా లెఫ్ట్ పార్టీలపై తప్పుడు రాతలు రాసినందుకు నిరసనగా రామన్నపేటలో 'నమస్తే తెలంగాణ' పత్రిక ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రామన్నపేటలో అదానీ గ్రూపునకు సంబంధించిన అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా మొదటినుంచీ ప్రజలను చైతన్యం చేస్తున్నది కమ్యూనిస్టులేనన్నారు. మండల కేంద్రంలో సదస్సు నిర్వహించి అఖిలపక్షాలను ఆహ్వానించి, రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది కమ్యూనిస్టు పార్టీలేనని తెలిపారు. పరిశ్రమకు వ్యతిరేకంగా అఖిలపక్ష కమిటీ ఏర్పాటుకు ప్రధాన భూమిక పోషించింది కమ్యూనిస్టులే అన్నారు. పత్రికలు వాస్తవాలను ప్రజలకు తెలియజేసే విధంగా ఉండాలని, తప్పుదోవ పట్టించే వార్తలు ప్రచురించరాదని అన్నారు. 15నిమిషాల ఆందోళన చేసిన అనంతరం పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ నిరసనలో సీపీఎం, సీపీఐ నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, ఊట్కూరి కృష్ణ, కందుల హనుమంతు, కల్లూరి నగేష్, బాలరాజు, భాగవంతం, నాగటి ఉపేందర్, గొరిగె సోములు, మునికుంట్ల లెనిన్, వెంకటేశ్వర్లు, సత్యం, భిక్షం పాల్గొన్నారు.



నమస్తే తెలంగాణ పేపర్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

మొబైల్ వాడకం శ్రేయస్కరం కాదు : సీఐ

భువనగిరి గంజ్/ అడ్డగూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నేటి తరం విద్యార్థులు మొబైల్‌ను ఎక్కువ వినియోగిస్తున్నారని, మొబైల్ వాడకం ఏమంత శ్రేయస్కరం కాదని భువనగిరి పట్టణ సీఐ సురేష్‌కుమార్ అన్నారు. భువనగిరిలోని శ్రీవాగ్దేవి జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన సెమీనార్‌లో ఆయన మాట్లాడుతూ అవసరానికి మించి నేటి తరం విద్యార్థులు మొబైళ్లు వాడుతున్నారని, అలా వాడకం వల్ల లాభ, నష్టాలు ఉన్నాయన్నారు. మొబైల్ వాడకం విద్యార్థుల ఆరోగ్యానికి మంచిదికాదని, ఒకవేళ మాట్లాడినా అవసరం ఉంటే సరళంగా మాట్లాడి ముగించాలని చెప్పారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఈ నెల 21 నుంచి 27 వరకు వార్షికోత్సవాలు ఉంటాయన్నారు. మొబైల్ వాడకంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సై కుమారస్వామి, కళాశాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి దరిపల్లి ప్రవీణ్‌కుమార్, లుంబిని గ్రూప్ విద్యా సంస్థల సలహాదారుడు బాలేశ్వర్, ప్రిన్సిపాల్ శ్రావణ్‌రెడ్డి, అధ్యాపకులు యాకుబ్, రామకృష్ణ, వీరయ్య, శ్రీకాంత్, మల్లేష్, మోయిన్, శ్యాంకుమార్, నాగమల్లేష్, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు. అడ్డగూడూరులో ఎస్ఐ డి. నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాచరచన పోటీలు నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే కిశోర్ వ్యాఖ్యలు అభ్యంతరకరం



మోత్కూరు: మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పోలీసులు

మోత్కూరు/ అడ్డగూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేశారని, అభ్యంతరకరమని కాంగ్రెస్ న ఆయకులు అన్నారు. ఈమేరకు కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కిషోర్‌కుమార్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకుని క్షమాణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కంచర్ల యాదగిరిరెడ్డి, డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, పైళ్ల సోమిరెడ్డి, పర్రెపాటి యుగంధర్, అవిశెట్టి అవిలిమల్లు, మునిసిపల్ వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, బద్దం నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

● అడ్డగూడూరు మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ చిత్రపటాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వళ్లంభట్ల రవీందర్ రావు, కడారి రమేష్, నాగులపల్లి రమేష్, చుక్క యాదగిరి, మంద రామచంద్రు, భైరెడ్డి సందీప్ రెడ్డి, మారిశెట్టి మల్లేష్ ఉన్నారు.

నీటి సరఫరాలో అలసత్వం వద్దు : లత

యాదగిరిగుట్ట రూరల్/రాజాపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి సరఫరా విషయంలో వాటర్‌మన్‌లు అలసత్వం తగదని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీయర్ జి.లత తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గత నాలుగు రోజుల నుంచి వాటర్‌మెన్‌లకు నీటి సరఫరా పైపు లీకేజీ పైపులైన్‌కు వాడే సామగ్రి, పలు అంశాలపై గత నాలుగు రోజులు ఇచ్చిన శిక్షణ ముగిసింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల వాటర్ ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయాలని, పైపులైన్ లీకేజీ కాగానే వెంటనే మరమ్మతులు చేపట్టాల, పైప్‌లైన్‌లో జాయింట్ ఉన్న చోట మురికి నీరు చేరుతున్నట్లయితే వెంటనే అరికట్టాలని తెలిపారు. శిక్షణ పొందిన వాటర్‌మన్‌లకు సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీవో సలీం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రజ్ఞ, వాటర్ మెన్‌లు తదితరులున్నారు.

● రాజాపేట ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ పొందిన సహాయకులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డీఈ పద్మావతి, ఏఈ వెంకటరమణ, ఎంపీడీవో నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు

మోటకొండూరు/చౌటుప్పల్ టౌన్/ ఆత్మకూరు (ఎం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని తొందరపడి దళారులకు విక్రయించి, మోసపోవద్దని ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రలంలో పీఏసీఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కొనుగోలు కుంద్రంలోని వరి ధాన్యాన్ని పరిశీలించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎగ్గిడి బాలయ్య, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తండ పాండురంగయ్య గౌడ్, బుగ్గ కొమురయ్య, భూమండ్ల శ్రీనివాస్, బాల్ద రామకృష్ణ పాల్గొన్నారు.

● చౌటుప్పల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మునిసిపాలిటీలోని చౌటుప్పల్, తాళ్లసింగారంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, డీసీవో ఎస్. శ్రీధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి , ఏఎంసీ సెక్రటరీ రవీందర్ రెడ్డి, ఏవో నాగరాజు, పీఏసీఎస్ సెక్రటరీ రమేష్ లు పాల్గొన్నారు.

● ఆత్మకూరు(ఎం) మండలంలో కూరెళ్ల, పుల్లాయిగూడెం, పల్లెర్ల, లింగరాజుపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్వంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్యాక్స్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి ప్రారంభించారు. వైస్ చర్మన్ గంధమల్ల జహంగీర్ , డైరక్టర్లు ఎస్.మల్లమ్మ, పి.నిర్మల, టి.నర్సింహ, కె.శ్రీరాములు, వి.యాదయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఓటు నమోదుచేసుకోవాలి

భువనగిరి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ఉపాధ్యాయులంతా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఉపాధ్యాయుల ఓటు నమోదు సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకునేలా బీజేపీ నాయకులు శ్రద్ధ చూపాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు చందా మహేందర్‌గుప్తా, ఊట్కూరు అశోక్ గౌడ్, జెన్నేపల్లి శ్యాసుందర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్, పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, కానుకుంట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద చేనేత కార్మికుల్లో వెలుగులు నింపాలి

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 24: నిరుపేద చేనేత కార్మికుల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతోనే టీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద చేనేత కార్మికుల త్రిఫ్టు స్కీం డబ్బులు అందజేసి తనవంతు సాయం అందించాలని టీఆర్ ఫౌండేషన్ చైర్మన్, ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంకు చైర్మన్ తడక రమేష్ అన్నారు. గురువారం భూదాన్‌పోచంపల్లి మార్కండేశ్వర స్వామి దేవాలయం ఆవరణలోని రజతోత్సవ భవనంలో చేనేత జనసమాఖ్య ఆధ్వర్యంలో తడక రమేష్‌ను సన్మానించారు.. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని ముగ్గురు నిరుపేద చేనేత కార్మికులు త్రిఫ్ట్ స్కీం కింద లబ్ధిదారుడి వాటా ధనం చెల్లించలేని దయనీయ స్థితిలో ఉన్న ఐదుగురు కార్మికులకు ఆర్థిక సాయం అందజేశారు. ఒక్కోరికి రూ. 20వేలు చొప్పున ఆర్థిక సాయం అందించగా వారికి ప్రభుత్వ పరంగా ఒక్కొక్కరికి రూ. 60వేలు రాగా బ్యాంకు ద్వారా మరో రూ. 6వేలు చొప్పున మొత్తం ఒక్కో కార్మికునికి రూ. 66వేలు చొప్పున అందాయి. నిరుపేద చేనేతలకు చేయూత నిచ్చిన తడక రమేష్‌ను చేనేత జనసమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. చేనేత జనసమాఖ్య జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, చింతకింది రమేష్, జిల్లా నాయకులు వేశాల మురళి, సీత సత్యనారాయణ, రాపోలు శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

వలిగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని గురువారం పట్టివేశారు. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... భువనగిరి మండలం పచ్చర్లబోడు తండాకు చెందిన ధరావత్ వెంకటేష్, కునుసోతు బలరాంలు 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా నాగారం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేయగా పట్టుబడ్డారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బేకరీ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

వలిగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బేకరీ షాపులో గడువు తీరిన పదార్థాలను విక్రయిస్తున్న వ్యాపారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న ఒక బేకరీలో గడువు తీరిన తిను పదార్థాలను, వస్తువులను తయారు చేస్తూ తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేశారు. ఈ మేరకు బేకరీ యజమాని సాగనయ్య పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

భువనగిరి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని హజరత్ గఫార్ ఖాద్రీ ఉర్సు బియాబాని 45వ ఉర్సు ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో మొదటి రోజున భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు నిర్వహించి, దర్గాలో సమర్పించారు. ఖవాలీ ఉత్సాహంగా సాగింది. అన్నదానం నిర్వహించారు. ఉర్సు ప్రత్యేకతలను మత పెద్దలు వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎండీ అబ్దుల్‌సమీ, ఎండీ అఫ్జల్ బియాబాని, ఎండీ ఇష్తేకార్, ఎండీ ఇంతియాజ్, ఎండీ ఇస్తియాక్ అహ్మద్, ఎండీ షానూర్ బాబా, ఎండీ.జలీల్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి చేయూత

వలిగొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి తనవంతు చేయూతనిస్తానని కర్నెకంటి యాదయ్య అన్నారు. గురువారం మండలంలోని వెంకటపురం గ్రామంలో గ్రామస్థులు సమావేశం నిర్వహించునేందుకు రచ్చబండకు లక్ష రూపాయలను విరాళం అందచేశారు. ఈ సందర్భంగా దాత యాదయ్య మాట్లాడుతూ, భవిష్యత్తులో ప్రజల అవసరాలకు తన వంతు చేయూత ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని విరాళం ఇచ్చిన దాతను గ్రామస్థులు సన్మానించారు. గ్రామపెద్దలు నాగయ్య, రాములు, మత్స్యగిరి నరేందర్, ఎల్లయ్య, మల్లయ్య, మధు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

వలిగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరూరు గ్రామంలో అసంపూర్తిగా ఉన్న సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్, డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అరూరు గ్రామంలో సీపీఐ గ్రామశాఖ సమావేశం జరిగింది. సీపీఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య, గ్రామశాఖ కార్యదర్శి మేడి దేవేందర్ పాల్గొన్నారు.

టీచర్ ఉద్యోగం సాధించిన కానిస్టేబుల్‌కు సన్మానం

ఆత్మకూరు(ఎం) అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వచ్చిన ఉద్యోగంతో సంతృప్తి చెందక తమ గోల్ సాధించాలని సంకల్పించుకుంటారు మరి కొందరు. అలాంటి కోవకు చెందిన రేణుక మహిళా కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూనే ఉపాధ్యాయ పోస్టు సాధించింది. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన రేణుకు 2020 లో ఆత్మకూరు(ఎం) పోలీస్‌స్టెషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా చేరింది. 2024 డీఎస్సీలో ఎస్‌జీటీగా పోస్టు సాధించింది. సూర్యాపేట జిల్లా తిర్మలగిరి మండలం వెలిశాల ప్రభుత్వ పాఠశాలలో పోస్టింగ్ వచ్చింది. గురువారం ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ సోలోమన్ రాజు, ఎస్ఐ కృష్ణయ్య, ఏఎస్ఐ సైదులు, సిబ్బంది, రేణుకను అభినందించారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి: సీఐ

ఆత్మకూరు(ఎం) అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు రోడ్డు రవాణా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సీఐ సోలోమన్‌రాజు ఆదేశించారు. డ్రైవర్లు పాటించాల్సిన నిబంధనలపై మండల కేంద్రంలోని ఆటో డ్రైవర్లు, మెకానిక్‌లకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతీ డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనం పర్మిట్ కాగితాలు కలిగి ఉండాలని, డ్రైవర్ పక్క సీట్లో ప్రయాణికులను కూర్చోబెట్టుకోవద్దని సూచించారు. ఆటోల్లో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతూ జీవనోపాధిని పొందాలని కోరారు.

గుట్ట తిరువీధిలో భక్తుడికి గుండెపోటు

భువనగిరి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శనానికి వచ్చిన భక్తుడు గుండెపోటుతో మృతిచెందాడు. గురువారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మేకగూడ గ్రామానికి చెందిన దేశపాక పోశయ్య (55) లక్ష్మీనృసింహుడిని దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులతో వచ్చాడు. దర్శనం అనంతరం మాఢవీధుల్లోకి రాగా ఛాతిలో నొప్పి రావడంతో ఆలయ సిబ్బంది, కుటుంబ సభ్యులు బ్యాటరీ వాహనంలో కొండకింద యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఆర్‌ఆర్‌ఆర్‌కు ముమ్మరంగా భూసేకరణ

● చౌటుప్పల్ డివిజన్‌లో 784.160 ఎకరాల భూమి అవసరం
● ఇప్పటికే 784 ఎకరాలకు 3జీ నోటిఫికేషన్ జారీ
● మరో 16.24 ఎకరాలకు కొత్తగా నోటిఫికేషన్ జారీకి సన్నాహాలు

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రిజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) నిర్మాణానికి భూసేకరణ వేగవంతమైంది. అందులో భాగంగా చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో మొత్తం 784.160 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉండగా, ఇప్పటికే అందులో 767.320 ఎకరాలకు 3జీ నోటిఫికేషన్‌ను అధికారులు జారీ చేశారు. మిగిలిన 16.24 ఎకరాలకు కొత్తగా నోటిఫికేషన్ జారీకి రెవెన్యూ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. భూ సేకరణ విషయమై చౌటుప్పల్, వలిగొండ మండలాల్లోని నిర్వాసితులతో ఆర్డీవో శేఖర్‌రెడ్డి నిర్వహిస్తున్న సమావేశాలు ఈ నెల 25తో ముగియనున్నాయి. ఈ సమావేశాలను నిర్వాసితులు బహిష్కరించడంతోపాటు, ధర్నాలు నిర్వహిస్తున్నారు. బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని నిర్వాసితులు పట్టుబడుతున్నారు. ఏదిఏమైనప్పటికీ ట్రిపుల్‌ఆర్ భూసేకరణను వేగవంతంగా పూర్తిచేసే దిశగా అధికారులు ముందుకువెళ్తున్నారు.



చౌటుప్పల్‌లో ఆర్‌ఆర్ఆర్ ఇంటర్ ఛేంజ్ జంక్షన్‌ను ఏర్పాటు చేసే ప్రాంతాలు

చౌటుప్పల్ మండలంలో గ్రామాల వారీగా..

గ్రామాలు	ఎకరాలు	రైతులు
లింగోజీగూడెం	2.345	5
చౌటుప్పల్	145.120	79
తాళ్లసింగారం	65.030	82
చిన్నకొండూరు	84.350	96
నేలపట్ల	80.145	133
తంగడపల్లి	14.310	16
మొత్తం	**392.105**	**411**

వలిగొండ మండలంలో గ్రామాల వారీగా..

గ్రామాలు	ఎకరాలు	రైతులు
పహిల్వాన్‌పూర్	110.245	152
గోకారం	34.030	10
పొద్దటూరు	99.175	162
వర్కట్‌పల్లి	44.115	12
రెడ్లరేపాక	103.295	71
మొత్తం	**392.055**	**407**

చౌటుప్పల్ మండలంలో 411 మందికి చెందిన 392.105 ఎకరాలు, వలిగొండ మండలంలో 407 మందికి చెందిన 392.055 ఎకరాల భూమిని ట్రిపుల్‌ఆర్‌కు అధికారులు సేకరించనున్నారు. అందులో 767.32ఎకరాలకు 3జీ నోటిఫికేషన్ జారీ చేసిన రెవెన్యూశాఖ అధికారులు రైతులతో తుది సమావేశాలను నిర్వహిస్తున్నారు. మిగిలిన 16.24 ఎకరాలకు కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. 3జీ నోటిఫికేషన్‌పై సమావేశాలు పూర్తి కాగానే రైతులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. అధికారులు సేకరించనున్న భూముల్లో వ్యవసాయ భూములతో పాటు వ్యాపార, నివాస గృహాల ప్లాట్లు సైతం ఉన్నాయి. నిర్వాసితుల్లో కొందరి పేర్లు రెండుసార్లు నమోదైంది. వీటిని పరిష్కరించాల్సి ఉంది.

కొత్తగా 16.24ఎకరాలు

కొత్తగా చౌటుప్పల్ మండలంలో 12.21ఎకరాలు, తంగడపల్లిలో 1.21, తాళ్ల సింగారంలో 2.22 ఎకరాలకు నోటిఫికేషన్ జారీకి రెవెన్యూశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. మొదటగా 767.320 ఎకరాలకు జారీచేసిన నోటిఫికేషన్‌లో ఈ భూములకు సంబంధించిన వివరాలను పొందుపరచలేదు. దీంతో 16.24 ఎకరాలకు కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయాల్సి వస్తోంది.

భూమికి బదులు భూమి ఇవ్వాలి

ఆర్‌ఆర్‌ఆర్‌లో కోల్పోతున్న భూములకు బదులుగా భూములు ఇవ్వాలని లేదా బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని చౌటుప్పల్ మండలంలోని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. చౌటుప్పల్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ హరికృష్ణ సమక్షంలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని భూ నిర్వాసితులు బహిష్కరించి, ధర్నా చేశారు. ధర్నాలో భూ నిర్వాసితులు చింతల దామోదర్‌రెడ్డి, డబ్బటి రాములు, గుజ్జుల సురేందర్‌రెడ్డి, చింతల సుధాకర్‌రెడ్డి, సందగళ్ల మల్లేష్, ఏనుగు ప్రతాప్ రెడ్డి, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఆర్‌ఆర్‌ఆర్' పరిహారం రెట్టింపు

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు పరిహారం పెంచుతామని హామీ ఇచ్చింది. ఆ మేరకు చర్యలు చేపట్టింది. రిజిస్ట్రేషన్ విలువ, బహిరంగ మార్కెట్లో ఉన్న ధర ఎలా ఉందో పరిశీలించింది. జిల్లాలో తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాల్లో భూములు సేకరించాల్సి ఉంది. తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండలాల్లో ఎకరానికి రిజిస్ట్రేషన్ విలువ రూ.3.37లక్షల నుంచి రూ.6.75లక్షల వరకు ఉంది. భువనగిరి, వలిగొండలో రూ.7.50లక్షల నుంచి రూ.13.50లక్షల వరకు ఉంది. చౌటుప్పల్‌లో రూ.12లక్షల వరకు రిజిస్ట్రేషన్ విలువ ఉంది. అయితే బహిరంగ మార్కెట్‌లో మాత్రం ఎకరానికి ఆయా ప్రాంతాల్లో రూ.కోటి నుంచి రూ.4కోట్లకు పైగా ధర ఉంది. ఇంటి స్థలం గజానికి రూ.800నుంచి రూ.3,500వరకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధర ఉండగా, బహిరంగ మార్కెట్‌లో గ్రామీణ ప్రాంతాల్లో రూ.6వేలు, అర్బన్ ప్రాంతాల్లో రూ.10నుంచి రూ.15వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.30వేలకు పైగా ఉంది. ప్రభుత్వం తాజాగా, తీసుకున్న నిర్ణయం ప్రకారం సవరించిన పరిహారం తుర్కపల్లి మండలంలో ఎకరాకు రూ.6.85లక్షల నుంచి రూ.11.47లక్షల వరకు పెరగనుంది. భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్‌లో పరిహారం పెంపుపై అధ్యయనం కొనసాగుతోంది.

అలైన్‌మెంట్‌లో మార్పులు ఉండవు

ప్రస్తుతం ఉన్న ఔటర్‌రింగ్‌రోడ్డుకు 40 నుంచి 50కిలోమీటర్ల దూరం నుంచి ఆర్‌ఆర్‌ఆర్‌కు గత ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించగా, కాంగ్రెస్ ప్రభుత్వం సైతం దీనికే ఆమోదముద్ర వేసింది. జిల్లాలో ఆర్‌ఆర్‌ఆర్‌కు మొత్తం 1,927ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఉత్తరభాగంలో నిర్మించే ఈ రోడ్డు 158కిలోమీటర్లు ఉంటుంది. జిల్లాతోపాటు, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని 19 మండలాలకు చెందిన 113 గ్రామాల మీదుగా ఈ రహదారి నిర్మాణం కానుంది. జిల్లాలో 34 గ్రామాల మీదుగా ఈ రోడ్డు వెళ్తుంది. చౌటుప్పల్‌లో 8 గ్రామాలు, వలిగొండలో 9, భువనగిరిలో 9, యాదగిరిగుట్టలో 2, తుర్కపల్లిలో 6 గ్రామల నుంచి ఈ రహదారి వెళ్లనుంది. ఉత్తర భాగంలో ఈ రహదారి 98.989కి.మీ నుంచి 118.188కి.మీ మైలురాయి వరకు మొత్తం 580.17ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది.